క్రీడారాణులు

- క్రీడల్లో రాణిస్తున్న అమ్మాయిలు
- అవమానాలు దిగమింగుతూ .. అవకాశాలను అందిపుచ్చుకుంటూ..
- స్టేట్ లెవల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ
- ప్రోత్సహిస్తే మరింత రాణిస్తామంటున్న బాలికలు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామీణ నేపథ్యం నిరుపేద కుటుంబం చదువుకుంటేనే ఉన్నతస్థాయికి చేరుకుంటామనే నమ్మకం. కానీ గేమ్స్ అంటే మహాఇష్టం. దీంతో చదువు కొనసాగిస్తూనే ఆటల్లో ఆరితేరుతున్నారు పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు. ఉన్నత చదువు, ఉద్యోగాల కోసం సాఫ్ట్‌బాల్ క్రీడను వారధిగా ఎంచుకున్నారు. అకుంఠిత దీక్షతో అనునిత్యం సాధన చేస్తూ లక్ష్యం దిశగా సాగుతూ సాఫ్ట్‌బాల్ క్రీడలో సాఫ్ట్‌గా రాణిస్తున్నారు. పాఠశాల స్థాయి క్రీడల నుంచి రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించే స్థాయికి ఈ విద్యార్థులు అభివృద్ధి చెందారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సైతం సాధించారు. ఈ విద్యార్థినులకు ఆ పాఠశాల పీడీ దేవ ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉన్నత క్రీడాకారులుగా వారిని తీర్చిదిద్దుతున్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల మనోగతం ఇలా..


సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో పీడీ దేవ

ప్రతి రోజూ ప్రత్యేక శిక్షణ



నాపేరు యువదర్శిని. మాది చిత్తూరు నగరం. తండ్రి గణేష్, తల్లి ధనసెల్వీ. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ చదివిస్తున్నారు. సాఫ్ట్‌బాల్ అంటే చాలా ఇష్టం. ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ పొందుతున్నాను. క్రీడలో మెళకువలు నేర్చుకుంటున్నాను. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించినందుకు ఆనందంగా ఉంది. మరింత సాధన చేసి జాతీయజట్టులో పాల్గొని క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలన్నదే నా కోరిక.

\- రాష్ట్రస్థాయి సిల్వర్ మెడల్‌తో యువదర్శిని

మొదట్లో కష్టంగానే ఉండేది



నా పేరు నందిని. తండ్రి శంకర్, తల్లి రేఖ. మాది చిత్తూరు నగరం. తండ్రి మేస్త్రీ పనులు చేస్తూ నన్ను ఉన్నతంగా చదివించేందుకు ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో సైతం రాణించేలా ప్రోత్సాహం కల్పిస్తున్నారు. మా పాఠశాలలో సాఫ్ట్‌బాల్ క్రీడ ఆడడం చూసి ఉత్సాహంతో నేర్చుకోవడం మొదలు పెట్టాను. మొదట్లో కాస్త కష్టంగానే ఉండేది. ఆ తర్వాత శిక్షణ పొంది పట్టు సాధించాను. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించేందుకు నా వంతు కృషి చేశాను. నా ప్రయత్నం ఇంతటితో ఆపకుండా ఇంకా సాధన చేసి మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తాను.

రాష్ట్రస్థాయి సిల్వర్ మెడల్‌తో నందిని

ఆడపిల్లలు ఆడడం ఏంటి అన్నారు ?



నా పేరు నిత్యభావన. తండ్రి వెంకటరావు, తల్లి నిర్మల. మాది చిత్తూరు నగరం. తండ్రి మేస్త్రీ పని చేస్తుంటారు. ఆటలు ఆకలి తీరుస్తాయా క్రీడలతో కొలువులొస్తాయా అనే భావన కొందరిలో ఉంటుంది. ఆడపిల్లలు బయట ప్రదేశానికి వెళ్లి ఆటలు ఆడడం ఏంటి అని కొందరు అనేవారు. అలాంటి మాటలను మా తల్లిదండ్రులు ఏమాత్రం పట్టించుకోకుండా నాకు శిక్షణ ఇప్పించేందుకు ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయి క్రీడలు ఆడేందుకు ప్రోత్సాహం కల్పించారు. మా పాఠశాలలో పీడీ సర్ ఇచ్చిన శిక్షణతో సాఫ్ట్‌బాల్ క్రీడను నేర్చుకున్నాను. ఎప్పుడూ ఇళ్లు వదిలి బయట వెళ్లని నేను ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చింది. చదువుతో పాటు సాఫ్ట్‌బాల్ క్రీడల్లోనూ ప్రతిభ కనబరచి భవిష్యత్‌కు పునాది బాటలు వేసుకుంటాను.

రాష్ట్రస్థాయి సిల్వర్ మెడల్‌తో నిత్యభావన

క్లుప్తంగా

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఐరాల: స్థానిక పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఆదివారం మండలానికి చెందిన టీడీపీ నాయకులు రంజిత్‌రెడ్డి, సుధాకర్, లోకనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సాయిరెడ్డి రాయచోటిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేవారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ పీహెచ్‌సీకి వందల సంఖ్యలో రోగులు వస్తున్నారని, పీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ లేనందున హైరిస్క్ గర్భిణులను జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తుండడంతో మండల కేంద్రం నుంచి 25 కి.మీ. దూరంలో ఉన్న జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలం



చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని సంతపేట ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న మల్లిక, శరణ్య ఇంట్లో ఆదివారం బ్రహ్మకమలం విరబూసింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు బ్రహ్మకమలాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే పూలు వికసించి కొన్ని గంటల వ్యవధిలోనే ముడుచుకుంటాయని ఆ కుటుంబీకులు వెల్లడించారు. అనంతరం ఆ పూలను గుడికి సమర్పించారు. కార్యక్రమంలో జైకార్తీక్, శివాణి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


నగదు విరాళం చేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి ఆదివారం ఓ దాత నగదు విరాళం చేశారు. చిత్తూరు మండలానికి చెందిన దాత గీర్వాణీ, చంద్రప్రకాష్ దంపతులు రూ.లక్ష నగదును నిత్య అన్నదానానికి అందజేశారు. ఈ విరాళం అందుకున్న ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వేపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: మండల కేంద్రంలోని అరుణానగర్ కాలనీలో వైరల్ జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. ఆదివారం అరుణానగర్‌కాలనీలో జరుగుతున్న సర్వేను ఆయన జిల్లా డెంగీ సబ్ యూనిట్ అధికారి భానుప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. కాలనీవాసులు వ్యాధుల బారిన పడకుండా చూడాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్యసిబ్బంది కాలనీలో ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాలనీలో జలుబు, దగ్గు వంటి సమస్యలు గుర్తించి వారికి మందులు అందజేశామన్నారు. నీటి నిల్వలు ఉన్న చోటా దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వైరల్ జ్వరాలు సోకితే స్థానిక పీహెచ్‌సీలో రక్తపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి కలుషితం వల్ల వచ్చే అనర్థాలను కాలనీలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం భువనేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఉద్యోగుల సన్మానం


జస్టిస్ కృష్ణమోహన్‌కు జ్ఞాపిక అందిస్తున్న న్యాయశాఖ ఉద్యోగులు, జిల్లా జడ్జి

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు సన్మానించారు. ఆదివారం చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో హైకోర్టు న్యాయమూర్తిని.. రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయశాఖ ఉద్యోగులు కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికతో కలిసి హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, సుందర్, గణేష్, పవనకుమారి, హరికృష్ణ, సంతోష్, యువరాజ్, రెడ్డెప్ప, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకావాలని తెలిపారు.

చెరువులకు జలకళ

వర్షాలకు నిండుకుండలా మాధవరం దొరచెరువు



నీటితో కళకళలాడుతున్న ఎగువ తవణంపల్లె అమ్మగారి చెరువు




ఊటనీరుతో నిండిన గాలివాన చెరువు

తుపాను ప్రభావంతో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహించి చెరువులకు నీరు చేరాయి. మండలంలోని పలు చెరువుల్లోకి నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. వాగుల్లో ఊటనీరు ప్రవహిస్తూ చెరువులకు చేరడం వల్ల నీటి మట్టం పెరుగుతోంది. దీంతో మండలంలోని దొరచెరువు నిండుకుండలా నిండి మొరవ ప్రవహిస్తోంది. అదేవిధంగా కొండ్రాజుకాలువ చెరువు నిండింది. మేడివంక ఆనకట్ట నిండి మొరపోయి సరకల్లు రామన్న చెరువుకు చేరింది. రామన్న చెరువు నిండుగా నిండి మొరవ పారుతోంది. ఎగువ తవణంపల్లె అమ్మగారి చెరువుకు బహుదానది నుంచి సప్లై చానల్ ద్వారా నీరు చేరి నిండుతుంది. అదేవిధంగా దిగువ మోదలపల్లె పంచాయతీలోని గాలివాన చెరువుకు ఊటనీరు చేరి నిండుతోంది. అరగొండ బహుదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు భూగర్భజలాలు పెరిగి సాగు, తాగు నీరు కొరత తీరుతుందని ప్రజలు భావిస్తున్నారు.

\- తవణంపల్లె

వణికిన చిత్తూరు

- చిత్తూరులో ఆదివారం రాత్రి భారీ వర్షం
- జలమయమైన కాలనీలు
- ఆగిపోయిన విద్యుత్ సరఫరా


జలమయమైన గాంధీ రోడ్డు

చిత్తూరు నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు కూడా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి ప్రధానంగా గతవారం నీవానది పొంగిపొర్లాయి. దీంతో అక్కడి పరివాహక ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. చాలా వరకు ఇళ్లల్లోకి వర్షపు నీరు రావడంతో పాటు దారుల గుండా వరద నీరు పోటెత్తడంతో పలుచోట్ల రహదారులు కూడా మూసుకుపోయాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భీమా నది పరివాహక ప్రాంతం తాజాగా కురిసిన భారీ వర్షంతో మళ్లీ ఉప్పొంగింది. భారీ వర్షానికి తోడు పిడుగులు పడడంతో విద్యుత్ సరఫరా సైతం ఆగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ఆపద వస్తుందోనని ఆయా కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. చర్చి వీధి ఎమ్మెస్సార్ కూడలి ఓటీకే రోడ్డు వెంగళరావు కాలనీ బ్రీడ్స్ పేట సీఎంటీ రోడ్డు జాన్స్ గార్డెన్, రామ్ నగర్ కాలనీ, గంగా కాలనీ తోటపాళెం, కైలాసపురం ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి.

\- చిత్తూర్ అర్బన్


కొంగారెడ్డి పల్లి ప్రధాన రహదారిపై కాలువ పొంగి పొర్లడంతో రోడ్డుపై ప్రవహిస్తున వర్షపు నీరు


పోస్టల్ కాలనీ కూడలి వద్ద రోడ్డుపై ఉప్పొంగుతున్న వర్షపు నీరు

అట్టహాసంగా దుర్యోధన వధ


దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 120వ సంవత్సర మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా ముగిసింది. సాయంత్రం ఆలయంలో ఉభయదారులచే ద్రౌపదీ దేవి, పాండవుల విగ్రహాలకు అభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో దుర్యోధనుడిని మట్టితో భారీ విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఉభయదారులు అమ్మవారికి, పాండవుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి దుర్యోధునుడి విగ్రహం వద్ద ఉంచారు. కళాకారులు దుర్యోధనుడు, భీముడు, ద్రౌపదీదేవి వేషధారణలో అలరించారు. మడుగులో దాకున్న దుర్యోధనున్ని.. భీముడు లాక్కొని వచ్చి వధించే ఘట్టం ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలైనా దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. సోమవారం ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం, ధర్మరాజులు పట్టాభిషేకంతో మహాభారత యజ్ఞం ముగుస్తుందని ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.